క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి



పీఎస్‌లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీఓ ఎల్. బ్రహ్మయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు బంగారు కుటుంబం, పంచాయతీ అభివృద్ధి సూచిక, సమాచార హక్కు చట్టం విషయాలపై సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారంకోసం వచ్చిన అర్జీలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని, పదేపదే సచివాలయం చుట్టూ తిప్పుకోవద్దన్నారు.

కంది విత్తన కిట్లు పంపిణీ

మర్రిపూడి: మండలంలోని 13 సచివాలయాలల్లోని రైతులకు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ కంది విత్తనాలు పంపిణీ చేశారు. గురువారం కాకర్ల రైతుసేవా కేంద్రంలో ఎల్ ఆర్‌జీ 52 రకం కందులను ఆయన చేతుల మీదుగా రైతులకు అందజేశారు. 13 రైతు సేవా కేంద్రాలకు 4 కిలోల సంచులు 3639 కిట్లు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3550 సంచులు ఆయా గ్రామాల్లోని రైతులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

రాత్రిళ్లు గస్తీ ముమ్మరం చేయాలి



రికార్డులు తనిఖీచేస్తున్న సీఐ భీమానాయక్

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండలాన్ని మాదకద్రవ్య మండలంగా తీర్చిదిద్దాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణపై ఎస్సై వెంకటేశ్వరనాయక్‌కు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిపెండింగ్ కేసులు, క్రైమ్ వివరాలపై చర్చించారు. రాత్రిళ్ల గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై సిబ్బంది నిఘా ఉంచేలా చూడాన్నారు. పేకాట, కోడిపందేలు, అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి ఇలాంటి కేసుల విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

330 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రానికి తూర్పు నాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1017 బేళ్లను తీసుకురాగా 687 బేళ్లను కొనుగోలుచేసి 330 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ.160 పలకగా, సరాసరి రూ. 196.03గా నమోదైంది. వేలంలో 33 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు రైతులకు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున రైతులు పచ్చిరొట్ట విత్తనాలు నాటుకొని కలియదున్నితే భూములు సారవంతమై దిగుబడులు వస్తాయన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.281 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అధిక సంఖ్యలో బేళ్ల తిరస్కరణకు గురవుతున్నాయని క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం వేలాన్ని నిలిపివేశారు. చర్చల అనంతరం రైతులు గురువారం వేలానికి అంగీకారం తెలిపి వేలంలో పాల్గొన్నారు. బుధవారం మిగిలిన 400 బేళ్లకు గురువారం వేలం నిర్వహించారు. అందులో 258 బేళ్ల కొనుగోలు చేసి 142 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.222.93గా నమోదైంది. వేలంలో 22 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

హనుమంతునిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని సబ్ డివిజన్ మలేరియా అధికారి రామాంజనేయులు అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రహదారులు. ఎన్నాళ్లీ అవస్థలు..

- అడుగడుగునా రోడ్లకు గుంతలు
- అడుగు తీసి అడుగు వేయాలంటే నరకమే
- రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోని పాలకులు, అధికారులు
- గ్రామాల్లో అధ్వానంగా లింకు రోడ్ల దుస్థితి



గుంతలతో అధ్వానంగా కంభం కనిగిరి రహదారి

హనుమంతునిపాడు: మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం జనవరి నాటికే రోడ్లన్నింటినీ అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటకలు ప్రకటనలు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రోడ్ల మరమ్మతుల గురించి కూడా పట్టించుకోవడం లేదు. ఫలితంగా గుంతలు పడిన ఈ రహదారుల్లో ప్రయాణం చేసేందుకు జంకుతున్నారు. కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు కూడా లేవు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్లకు కనీసం మరమ్మతులు చేసేందుకు కూడా అధికారులు ప్రతిపాదనలు తయారు చేయడం లేదు. ఇక పాలకులు ఈ రోడ్ల గురించి ఎప్పుడో మరిచిపోయారు.

పట్టించుకునేదెవరు..?

మండలంలో కంభం కనిగిరి రహదారిలో బ్రిటీష్ కాలం నాడు వేసిన రోడ్డు రాళ్లు బయట పడ్డాయి. కనిగిరి నుంచి వేములపాడు ఘాట్ రోడ్డు వరకు 26 కిలో మీటర్లు రోడ్డు అధ్వానంగా గుంతలు పడి ఉంది. తిమ్మారెడ్డిపల్లి రోడ్డు నుంచి నందనవనం వరకు 15 కిలోమీటర్లు అధ్వానంగా గుంటలు పడి రెండు వైపులా చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా తయారైంది. పెద్ద గొల్లపల్లి, పాపిరెడ్డిపల్లి, కుడుములకుంట-రంగంపేట రోడ్డు, ఉమ్మనపల్లి- నందనవనం రోడ్డు, వేములపాడు-నందనవనం రోడ్డు, హనుమంతునిపాడు-దాసరిపల్లి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రోడ్లకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, వ్యాన్‌లు, బస్సులు, వివిధ పనులకు వెళ్లే కూలీలు ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో అరగంట పట్టే ప్రయాణం గంటకు పైగా పడుతుందని వాపోతున్నారు. రాత్రి పూట పొలాలకు ఈ రోడ్లలో ప్రయాణం చేయలేక కాలినడకన పొలాలకు వెళుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తట్ట మట్టి కూడా పోయకపోవడంతో ఈ రోడ్లలో ప్రయాణమంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు కనీస మరమ్మతులు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.



హనుమంతాపురం- ఉమ్మనపల్లి రహదారి



ఉమ్మనపల్లి- నందనవనం రహదారి

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడదాం

- ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలం
- హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



బాబు షూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం, బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దద్దాల మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగించారన్నారు. లక్షల కోట్ల రూపాయలను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి గడప వద్దకే చేరాయన్నారు. కానీ కూటమి పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేయడం లేదన్నారు. ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా గాడి తప్పిందన్నారు. తల్లికి వందనం పథకంలో భారీ కోతలు విధించి గొప్పలు చెప్పుకోవడం టీడీపీ నేతలకే చెల్లిందన్నారు. రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఒక్క పథకాన్ని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇలా ఏ ఒక్క పథకాన్ని అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కేవలం మాయమాటలు చెబుతూ కూటమి నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదామన్నారు. అనంతరం బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయం సావిత్రి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కటికల వెంకటరత్నం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినారయణరెడ్డి, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజి, మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబి, సర్పంచ్ కత్తిరాజారావు, బూత్ కమిటీ అధ్యక్షులు కస్తాల బాలాజి, బీసీ సెల్ అధ్యక్షుడు ద్ది తిరుపతయ్య, కలికాల నారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రూ.15 కోట్ల స్త్రీ నిధి రుణాలు



ఫోర్టిఫైడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీజీఎం ఉమామహేశ్వరరావు

కొండపి: మండలంలోని డ్వాక్రా మహిళలకు 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ.15 కోట్ల వరకు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేస్తామని జోనల్‌స్థాయి అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక డీఆర్డీఏ వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.గోపీనాథ్ అధ్యక్షతన మండలంలోని వీఓఏలకు గ్రామ సంఘ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోనల్ స్థాయి అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీ నిధి విభాగంలో జిల్లాలో మొత్తం 38 మండలాల్లో కొండపి మండలం పనితీరు ఐదో స్థానంలో ఉందని సిబ్బందిని ప్రశంసించారు. ఇదే విధంగా కొనసాగడానికి వీఓఏలు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. స్త్రీ నిధి రుణ రికవరీ శాతం ఎక్కువగా ఉండటంతో మండలానికి రూ.8 కోట్ల టార్గెట్ ఉంటే రూ.15 కోట్ల వరకు పెంచి రుణాల విడుదలకు అవకాశం కల్పిస్తామన్నారు. మండలంలో రెండు మూడు గ్రామాల్లో రికవరీ శాతం తక్కువగా ఉన్నందున ఆ గ్రామ సంఘాల్లో కూడా రికవరీ 100 శాతం ఉండేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన పీ4 పథకం పట్ల ప్రతి కుటుంబాన్ని మహిళలను చైతన్యం చేసి భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. టాటా ట్రస్ట్ ప్రాజెక్టు అసోసియేట్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రస్తుత రకరకాల రసాయనాల వస్తువులు వాడడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఫోర్ట్ ఫైడ్ వస్తువులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం ఫోర్టుఫైడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏపీఎం గోపీనాథ్, ఎంఎస్ కార్యవర్గ సభ్యులు కామేశ్వరి, సెక్రటరీ సుభాషిణి, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, గోవిందమ్మ, రమణమ్మ, కోటేశ్వరమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు తగదు

కనిగిరిరూరల్: సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికుల పట్ల కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం తగదని సీఐటీయూ నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ బదిలీ కార్మికులను పనుల్లోకి తీసుకోకుండా కక్ష్య సాధింపుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. పట్టణ జనాభ కనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించుకోవాలన్నారు. విధులకు హాజరు కాని పారిశుధ్య కార్మికుల పేరుతో అక్రమాలకు పాల్పడం, పీఎఫ్, ఈఎస్ఐ, సంక్రాంతి కానుకలు, దుస్తులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. శానటరీ ఇన్‌స్పెక్టర్ తీరు సక్రమంగా లేదని ఆరోపించారు. చార్లెస్, లక్ష్మయ్య, నరేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు



మాట్లాడుతున్న ఆర్డీఓ బీ కేశవర్ధన్‌రెడ్డి, పక్కన చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా వారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పక్షోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల అక్రమంగా రవాణా చేయడం అనేది తీవ్రమైన నేరంగా తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బాలల అక్రమ రవాణ లాంటి నేరాలను అరికట్టుట, నిరోధించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ ఎంవీ రవిశంకర్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు, బాలల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినా, అనుమానం వచ్చినా.. వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1098, 100, 112కు కాల్ చేయాలని అవగాహన కల్పించారు. సర్పంచ్ దమ్ము వెంకటయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్ బాబు, నవకుమార్, ఎలీషా, పవన్ పాల్గొన్నారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలోని కాలభైరవ స్వామి దేవస్థానంలో గురువారం ఆషాడ బహుళ అమావాస్య సందర్భంగా కాలభైరవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి ఐఏఎస్ పాపిశెట్టి రామ్మోహనరావు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామికి బూడిద గుమ్మడికాయలతో దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.



కాలభైరవుని దర్శనానికి వేచి ఉన్న భక్తులు

జీవనోపాధుల ప్రణాళికపై అవగాహన



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎం విద్యాసాగర్

పామూరు: జీవనోపాధుల ప్రణాళికపై వీఓఏ, మండల సమాఖ్య ఓబీ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం గంటా విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండలంలోని వీఓఏలకు, మండల సమాఖ్య ఏబీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం విద్యాసాగర్ సభ్యుల అర్హతలు, హక్కులు, ప్రణాళిక, సభ్యుల జీవనోపాధుల ప్రణాళిక, ప్రభుత్వ ఆస్తులు, సేవలు, వనరుల అభివృద్ధి ప్రణాళిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక ఏవిధంగా గుర్తించాలి, వాటిని యాప్‌లో ఎలా నమోదుచేయాలి అనే అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ, పద్మ, సీసీలు సుబ్రహ్మణ్యం, సరణ, అకౌంటెంట్ భారతి, వీఓఏలు పాల్గొన్నారు.

పలువురికి దద్దాల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంచం పట్టిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కత్తి రత్నంకు పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ రూ.10 వేల అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా చిన్న ఉమ్మనపల్లిలో వార్డు మెంబర్ జక్రయ్య మృతి చెందారని తెలుసుకొని ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. అదే గ్రామానికి చెందిన కొండెపోగు జాలయ్య కుమారుడు కొండెపోగు వెంకటయ్య రైలు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలి, సర్పంచ్ కత్తి రాజారావు, జిల్లా అధికార ప్రతినిధి ఆదినారాణరెడ్డి, బాబు, తెల్లగడ్డ వెంకట్రావు, గొబ్బిల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండపి చేరుకున్న ర్యాలీ ఫర్ ఆక్సిజన్



సేవ్ ఫర్ ఆక్సిజన్ పేరుతో ప్రపంచ యాత్ర చేస్తున్న ముత్తు సెల్వన్

కొండపి: ర్యాలీ ఫర్ ఆక్సిజన్ పేరుతో ప్రపంచ పర్యటన చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ సమీపంలోని తిరుచయ్ గ్రామానికి చెందిన ముత్తు సెల్వన్ గురువారం సాయంత్రం కొండపికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా ముత్తు సెల్వన్ మీడియాతో మాట్లాడుతూ కరోనాలో నా ఇద్దరు స్నేహితులు ఆక్సిజన్ అందక మరణించారని, వారి మరణం ఎంతో కలచివేసిందని తెలిపారు. ఆక్సిజన్ అందకుండా ఎవరు చనిపోకూడదనే ఉద్దేశంతో బయో మెడికల్ ఇంజినీరింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి చెట్లను నాటాలని ఉద్దేశంతో సైకిల్‌పై ర్యాలీ చేస్తూ చెట్లను నాడుతున్నట్లు తెలిపాడు. ఇప్పటి వరకు మూడేళ్లలో 8 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో సీఐ సోమశేఖర్ ప్రశంసా పత్రాన్ని అందజేశాడు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యాభ్యాసన సామగ్రి పంపిణీచేస్తున్న హెచ్‌ఎం

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు దాతలు విద్యాభ్యాసన సామగ్రిని అందజేయడం కొనియాడదగినదని హెచ్‌ఎం జె.భారతి అన్నారు. మండలంలోని ఆనికాలపాల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్‌యం జె.భారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని చింతపూడి గ్రామానికి చెందిన గుంటిమడుగు శ్రీనివాసవర్మ సమకూర్చి ఇచ్చిన పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్‌వీ అలేఖ్య, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ షేక్.అఫ్రోజ్, అంగన్‌వాడీ కార్యకర్త షేక్.షహనాజ్ పాల్గొన్నారు.

వీఎస్ అచ్యుతానందన్‌కు ఘన నివాళి



వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కొండపి: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ అంటే కేవలం రాజకీయ నేత మాత్రమే కాదని కేరళ మనస్సాక్షిని ముప్పరాజు కోటయ్య అన్నారు. మండలంలోని పెరిదేపి గ్రామం ఎంఎస్.వికే భవన్లో కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ సంతాప సభను సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష నేతగా పార్టీ కార్యదర్శిగా ఆయన తుదికంట ప్రజాసేవలో తరించారన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా తాను నమ్మిన ఆశయాలను ఆదర్శాలను వీడలేదన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, మల్లెల చినపేతురు, బ్రహ్మయ్య, పెద్ద పేతురు, అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, రాయపాటి నరసింహారావు, ముప్పరాజు చెంచయ్య, శేషారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ, జీసీడీఓ

కనిగిరిరూరల్: పట్టణంలోని పలు పాఠశాలలను డిప్యూటీ డీఈఓ ఎం శ్రీనివాసులరెడ్డి, సమగ్ర శిక్ష జీసీడీఓ కె. హేమలత గురువారం తనిఖీ చేశారు. స్థానిక బాలకోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను డిప్యూటీ డీఈఓ, జీసీడీఓలు తనిఖీలు చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. విద్యాశక్తి, విజయపథం కార్యక్రమాలను పరిశీలించి, విద్యార్థులకు యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం విద్యాబోధన తీరును, పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్‌బుక్స్, టీచర్స్ బుక్‌లను పరిశీలించారు. ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, దేవిరెడ్డి రామిరెడ్డి, జి. సంజీవి, జి.పెద్దిరాజు, హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సయ్యద్ హసీనా బేగం పాల్గొన్నారు.